AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
26-9-2025 (Friday) MAIN EDITION

## ఐపీవోకు మరో ఇన్‌ఫ్రా కంపెనీ




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** టెలికాం ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, ఎనర్జీ సొల్యూషన్స్ అందించే పేస్ డిజిటెక్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. 26న ప్రారంభమైన సబ్‌స్క్రిప్షన్ 30వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కంపెనీ మార్కెట్ నుంచి రూ. 819.15 కోట్లను సమీకరించనుంది. రూ. 2 ముఖ విలువ కలిగిన 3.74 కోట్ల తాజా షేర్లను జారీ చేసింది. ఒక్కో ఈక్విటీ షేరు ధరను రూ. 208 నుంచి రూ. 219గా నిర్ణయించింది. లాట్ సైజు 68 షేర్లు. రిటైల్ ఇన్వెస్టర్లు గరిష్ట ప్రైస్ బాండ్ వద్ద కనీసం ఒక లాట్ కోసం రూ. 14,892 తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గరిష్టంగా 14 లాట్లకు బిడ్ వేయవచ్చు.

## మూడోసారి తలపడనున్న పాక్–భారత్




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** దుబాయ్ వేదికగా ఆసియా కప్ 2025 టోర్నమెంట్ గ్రాండ్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టైటిల్ పోరులో ఆదివారం భారత జట్టు, పాకిస్తాన్‌తో తలపడనుంది. గురువారం జరిగిన సూపర్ 4 మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు బంగ్లాదేశ్‌పై గెలుపొంది ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్తాన్ రెండు సార్లు తలపడగా, ఆ రెండింటిలోనూ భారత్ విజయం సాధించింది. ఇప్పుడు ఆసియా కప్ టైటిల్ కోసం ఇరు జట్లు మూడోసారి తలపడనున్నాయి.

## రైలులో పోలీసుల తనిఖీలు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు కలకలం రేపాయి. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. దీంతో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో అధికారులు ట్రెయిన్‌ను నిలిపివేశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఘట్‌కేసర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు.

## ఇంధన ఎగుమతులపై రష్యా నిషేధం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉక్రెయిన్ డ్రోన్లు నిరంతరం ఇంధన సరఫరా వ్యవస్థలపై దాడులు చేయడంతో రష్యాలో చమురు కొరత ఏర్పడింది. దీంతో అన్నిరకాల చమురు ఎగుమతులను నిలిపివేయాలని క్రెమ్లిన్ ఆదేశించింది. నిషేధం ఈ ఏడాది చివరి వరకు అమల్లో ఉండనుంది.

## మహిళల ఖాతాల్లో రూ.10వేలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. ఇందుకు సంబంధించి శుక్రవారం ప్రధాని మోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించారు.

## బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రిజర్వేషన్ల అంశంపై సీఎం చర్చించారు. అనంతరం బీసీ రిజర్వేషన్ల కోసం జీవో విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. సాయంత్రం వరకు జీవో విడుదల చేసే అవకాశం ఉంది. అనంతరం ఒకటి రెండు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయనుందని సమాచారం.

## రేపటినుంచి బీఎస్ఎన్ఎల్ 'స్వదేశీ' 4జీ సేవలు..

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్ :** బీఎస్ఎన్ఎల్ 'స్వదేశీ' 4జీ సేవలు రేపటినుంచి దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. శనివారం ప్రధాని మోదీ ఈ సేవలను ప్రారంభించనున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో ఈ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. తద్వారా ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనాల తర్వాత వాణిజ్య నెట్‌వర్క్‌లో సొంత స్వదేశీ టెలికాం సాంకేతికత, పరికరాలను కలిగి ఉన్న ఐదో దేశంగా భారతదేశం నిలవనుంది. సెప్టెంబర్ 27న బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను దేశవ్యాప్తంగా సుమారు 97,500 కంటే ఎక్కువ సైట్లలో అందుబాటులోకి తేనున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం తెలిపారు.



# ఎడతెరిపిలేని వాన..

**ఎడతెరిపి లేని వానలతో హైదరాబాద్ నగరం అతలాకుతలం అవుతోంది. మహా నగరాన్ని వానలు వదలడం లేదు. గురువారం ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తింది. రహదారులు చెరువులను తలిపిస్తున్నాయి. దీంతో పలు మార్గాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచి వాహనదారులు రోడ్లపై నరకయాతన అనుభవిస్తున్నారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్**

- హైదరాబాద్ నగరంలో భారీ వర్షం
- భారీగా ట్రాఫిక్ జాం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సంగారెడ్డిని ముంచెత్తిన వాన

హైదరాబాద్ నగరాన్ని వరుణుడు వదలడం లేదు. ఎడతెరిపి లేకుండా నుంచి కురుస్తున్న వర్షంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం ప్రారంభమైన వర్షం ఇంకా పడుతూనే ఉంది. రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. కొత్తపేట, చైతన్యపురి, హయత్‌నగర్, చందానగర్, శేరిలింగంపల్లి, మూసాపేట, సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, ఎల్బీ నగర్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్ సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### రోడ్లపై నిలిచిన నీరు

భారీ వర్షంతో రోడ్లపై నీరు చేరింది. పలు మార్గాల్లో ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. పటాన్‌చెరులో వర్షం పడడంతో హైదరాబాద్ - ముంబై హైవేపైకి వరద నీరు చేరింది. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మియాపూర్ మంజీరా పైప్ లైన్ రోడ్డు నుంచి కొండాపూర్ వెళ్లే మార్గంలో రైల్వే అండర్ పాస్ దగ్గర వరద నీరు చేరింది. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. గచ్చిబౌలి పరిధిలోని ఐఎస్‌బీ నుంచి మైక్రోసాఫ్ట్ క్యాంపస్ ద్వారా విప్రో జంక్షన్ వరకు వాహనాలు నెమ్మదిగా సాగాయి. చెరువు పొంగిపొర్లడంతో రోడ్డుపైకి నీరు చేరింది.


### వర్షాలపై సీఎం సమీక్ష

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తాజా పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి సమీక్షించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### బతుకమ్మకుంట ప్రారంభోత్సవం వాయిదా

నగరంలో వర్షాల కారణంగా శుక్రవారం జరగాల్సిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. ఈ నెల 28న సాయంత్రం ఈ కార్యక్రమం ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ తాజాగా అభ్యర్థిని ప్రకటించింది. జూబ్లీహిల్స్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పేరును పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అప్పుడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కూడా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

కాగా.. జూబ్లీహిల్స్ టికెట్ కోసం అధికార కాంగ్రెస్‌లో పోటీ నెలకొంది. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌తో పాటు పాటు మరికొందరు పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక బీజేపీ నుంచి చాలా మంది టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఓటుకు నోటు కేసులో సుప్రీం కీలక తీర్పు.. మత్తయ్యకు ఊరట



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో జెరూసలెం మత్తయ్యకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. బీఆర్ఎస్ మొదటి సారి అధికారంలోకి వచ్చిన సమయంలో ఓటు నోటు కేసు వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ నాయకులు తమకు ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే స్టిఫెన్‌సన్‌కు డబ్బులు ఇచ్చినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో టీడీపీ నాయకులు, స్టిఫెన్‌సన్‌కు మధ్యవర్తిగా వ్యవహరించినట్లు మత్తయ్యపై కేసు నమోదైంది. అయితే ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు గతంలోనే కొట్టి వేసింది. దీంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను శుక్రవారం కొట్టేసింది.



## మిగ్–21 యుద్ధ విమానాలకు వీడ్కోలు

దశాబ్దాల పాటు భారత సైన్యానికి సేవలందించిన మిగ్ -21 యుద్ధ విమానాలకు ఎయిర్ ఫోర్స్ వీడ్కోలు పలికింది. ఎన్నో యుద్ధాల్లో భారత్‌కు విజయాన్ని అందించిన ఈ విమానాలకు శుక్రవారం ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్ ఘనంగా వీడ్కోలు పలికారు. చండీగఢ్‌లోని ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాయుసేన సీనియర్, మాజీ అధికారులు హాజరయ్యారు. కాగా.. భారత వైమానిక దళంలో మిగ్-21 ప్రయాణం అద్భుతంగా సాగింది. దాదాపు 900 మిగ్-21 యుద్ధ విమానాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నిర్వహించింది.

-అక్షరటుడే, నేషనల్ డెస్క్

## ఔషధాలపై వందశాతం టారిఫ్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ మరో పిడుగు వేశారు. అక్టోబరు 1వ తేదీ నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే అన్ని ఔషధాలపై 100 శాతం టారిఫ్ విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం భారత కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపనుంది. కాగా, యూఎస్‌లో ఔషధాలు తయారు చేసే కంపెనీలకు ఈ టారిఫ్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ విషయాన్ని యూఎస్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు.

భారత ఔషధ పరిశ్రమకు యూఎస్ ప్రధాన మార్కెట్. మన దేశం నుంచి 40 శాతం ఔషధాలు అమెరికాకే ఎగుమతి అవుతాయి. ఈ క్రమంలో ట్రంప్ తీసుకున్న వంద శాతం టారిఫ్ నిర్ణయం వల్ల భారత ఫార్మాస్యూటికల్ పరిశ్రమపై మరింత ప్రభావం చూపనుందని నిపుణులు భావిస్తున్నారు.

## ట్రంప్ దెబ్బకు కుదేలైన దలాల్ స్ట్రీట్..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ట్రంప్ సుంకాల ప్రకటనతో ఆసియా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. దీని ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా కనిపించింది. బ్రాండెడ్, పేటెంట్ పొందిన ఔషధాలు, హెవీ డ్యూటీ ట్రక్కులు వంటి విస్తృత శ్రేణి వస్తువులపై ట్రంప్ అదనపు సుంకాలు విధించారు. దీంతో ఫార్మా రంగంలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి నెలకొంది. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 203 పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. చివరికి సెన్సెక్స్ 733 పాయింట్ల నష్టంతో 80,426 వద్ద, నిఫ్టీ 236 పాయింట్ల నష్టంతో 24,654 వద్ద ముగిశాయి.

## పూజా హెగ్డే బ్యాడ్ లక్..!



తెలుగు చిత్రసీమలో ఓ వెలుగు వెలిగిన స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి అడుగు పెట్టి తన అందం, అభినయంతోనే కొద్ది కాలంలోనే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా నిలిచింది. కానీ.. రాధేశ్యామ్, ఆచార్య, బీస్ట్ వంటి సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో పూజా కెరీర్ ఊహించని మలుపు తిరిగింది. అవకాశాలు తగ్గిపోవడంతో బాలీవుడ్ వైపు మొగ్గు చూపింది. కానీ అక్కడ కూడా బాక్సాఫీస్ పరంగా ఆమెకు ఆశించిన విజయాలు దక్కడం లేదు. దీంతో ఇటీవల సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'కూలీ' చిత్రంలో 'మోనికా' స్పెషల్ సాంగ్‌లో కనిపించింది. ఆ పాటలో ఆమె డాన్స్ స్టెప్పులు సోషల్ మీడియాలో వైరల్ అయినా, సినిమా మాత్రం పెద్దగా నిలదొక్కుకోలేకపోయింది. ఒకప్పుడు టాప్ ప్లేస్ దక్కించుకున్న పూజా హెగ్డే ప్రస్తుతం సినిమాలకు దూరంగా, సైలెంట్ మోడ్‌లో కనిపిస్తోంది. అయితే గ్లామర్, నటన రెండూ ఉన్న ఈ బ్యూటీకి ఒక మంచి స్క్రిప్ట్, మరిచిపోలేని పాత్ర దొరికితే రీ ఎంట్రీలో బాక్సాఫీస్‌ని షేక్ చేయడం ఖాయం.

– అక్షరటుడే, సినిమాడెస్క్